అప్రమత్తంగా ఉండండి

సిటీబ్యూరో, జూన్ 11(నమస్తే తెలంగాణ): గ్రేటర్‌లో కురుస్తున్న వర్షాలతో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని అధికారులకు మేయర్ గద్వాల విజయలక్ష్మి ఆదేశాలు జారీ చేశారు. జోనల్ కమిషనర్లు, ఎస్ఈలతో మంగళవారం సాయంత్రం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించిన ఆమె వర్షాలు కురుస్తున్నందున యంత్రాంగం అప్రమత్తంగా ఉండి సహాయక చర్యలు వేగంగా చేపట్టాలన్నారు.

ఉన్నత చదువుకు 'ద హోం ఫర్ ఆర్ఫన్' సాయం

సిటీబ్యూరో, జూన్ 11(నమస్తే తెలంగాణ): పదో తరగతిలో ఉత్తీర్ణులై, ఇంటర్ చదివేందుకు ఆర్థిక ఇబ్బందులున్న విద్యార్థులు తమను సంప్రదించాలని 'ద హోం ఫర్ ఆర్ఫన్ స్టూడెంట్స్' సంస్థ మంగళవారం పేర్కొంది. భోజనం, నివాసం కల్పించి చదువుకయ్యే ఖర్చు తామే చూసుకుంటామని తెలిపారు. దాతల సాయంతో తాము సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. నిరుపేద విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడానికి ఫోన్ నం. 93912 21697లో సంప్రదించాలని కోరారు.

ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

చిక్కడపల్లి, జూన్ 11: ఆరె కటికలకు ప్రభుత్వం వెంటనే 500 కోట్లతో ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఆరె కటిక అభివృద్ధి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.భూంపల్లి అశోక్ కుమార్ రాష్ట్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఆరె కటిక అభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఆరెకటిక 10 లక్షలకు పైగా జనాభా ఉందన్నారు. అన్ని కులాల వారికి కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఆరెకటికలకు మాత్రం ఇవ్వలేదన్నారు. తమ డిమాండ్లను వెంటనే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో దినేశ్, సరస్వతి బాయి, పవన్ కుమార్, జహంగీర్, రాజు, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

నత్తకు నడక నేర్పేలా.. క్రమబద్ధీకరణ

హెచ్ఎండీఏలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల స్థితిగతులు

లక్ష్యం నిర్ణయించినా వేగవంతం కానీ క్రమబద్ధీకరణ ప్రక్రియ

ప్లానింగ్ విభాగంపై పని భారం.. కార్యాచరణలో తీవ్ర జాప్యం

సిటీబ్యూరో, జూన్ 11(నమస్తే తెలంగాణ): నత్తకు నడక నేర్పేలా హెచ్ఎండీఏలో ఎల్లారెస్ క్రమబద్ధీకరణ ప్రక్రియ కొనసాగుతున్నది. ప్రభుత్వానికి ఆదాయం.. ప్లాట్ల యజమానులకు ఎంతో ఊరట కలిగించే ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల అంశం క్రమబద్ధీకరణలో నత్తనడకన సాగుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వం గత ఫిబ్రవరిలోనే ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను వేగంగా పరిశీలించి, మార్చి 31 నాటికి క్రమబద్ధీకరణ పూర్తి చేస్తామంటూ ఆర్భాటంగా ప్రకటించింది. మార్చి గడిచిపోయి రెండు నెలలు అవుతున్నా... ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన 'ఎక్కడ వేసిన గొంగళి అక్కడే..' అన్న చందంగా ఉంది. ప్రధానంగా నగర శివారు ప్రాంతాల నుంచి హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ) పరిధిలో 3.4 లక్షలకు పైగా దరఖాస్తులు వచ్చాయి. ప్రణాళికా విభాగంలో తక్కువ సిబ్బంది ఉండటంతో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా చేయలేకపోతున్నారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పరిశీలించి క్రమబద్ధీకరణ చేస్తే ఫీజుల రూపంలో సుమారు రూ.450 కోట్ల మేర ఆదాయం రావొచ్చని

అధికారులు అంచనా వేశారు. నాలుగు జోన్లుగా విస్తరించిన హెచ్ఎండీఏ పరిధి 25–30 కి.మీ వరకు ఉండటంతో ఆయా ప్రాంతాలకు వెళ్లి క్షేత్ర స్థాయిలో లే అవుట్లను, ప్లాట్లను పరిశీలించాలంటే తగిన సిబ్బంది అందుబాటులో లేరని, అందుబాటులో ఉన్న సిబ్బందితో చేస్తుండటంతో చాలా తక్కువ సంఖ్యలో ప్లాట్ల క్రమబద్ధీకరణ జరుగుతోందని ప్లానింగ్ విభాగానికి చెందిన ఓ అధికారి తెలిపారు.

హెచ్ఎండీఏ నాలుగు జోన్ల పరిధిలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు

జోన్స్	స్వీకరించిన దరఖాస్తులు
శంకర్‌పల్లి	73915
ఘట్‌కేసర్	159672
మేడ్చల్	30850
శంషాబాద్	80289
మొత్తం	344726

ప్లానింగ్‌లో పని భారం..

గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) పరిధి దాటిన తర్వాత విస్తరించి ఉన్న హెచ్ఎండీఏలోని శివారు ప్రాంతాల్లో కొత్తగా పట్టణీకరణ శరవేగంగా చోటు చేసుకుంటోంది. ఈ ప్రాంతాల్లో కొత్తగా భవన నిర్మాణాల అనుమతులు, లే అవుట్ల అనుమతులు ఇవ్వడానికి చాలా సమయం పడుతోంది. ప్లానింగ్ విభాగంలో గతంతో పోల్చితే ఇప్పుడు పని భారం చాలా ఎక్కువగా ఉందని, దానికి సరిపడా నైపుణ్యం కలిగిన ప్లానింగ్ సిబ్బంది లేకపోవడంతో ఎల్ఆర్ఎస్ ప్రక్రియను వేగంగా పూర్తి చేయకపోతున్నామనే అభిప్రాయాన్ని ప్లానింగ్ విభాగం అధికారులు వ్యక్తం చేస్తున్నారు. గతంలోనూ ఎల్ఆర్ఎస్ క్రమబద్ధీకరణ కోసం ప్రత్యేకంగా సిబ్బందిని నియమించి పూర్తి చేసిన విషయాన్ని అధికారులు ప్రభుత్వానికి విన్నవించినా, సిబ్బందిని పెంచడం లేదు. తక్కువ సిబ్బంది ఉండటం వల్లే వేగవంతంగా ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల ప్రక్రియను పూర్తి చేయలేకపోతున్నామని, ఈ విషయంలో ప్రభుత్వం తగిన నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉందని ప్లానింగ్ విభాగం అధికారులు పేర్కొంటున్నారు.

లక్షల్లో ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు..

గ్రేటర్ హైదరాబాద్ తర్వాత ఉన్న హెచ్ఎండీఏ పరిధిలో భారీ సంఖ్యలోనే ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు వచ్చాయి. ఏడు జిల్లాల్లో విస్తరించిన ఉన్న హెచ్ఎండీఏ పరిధిలోని 47 మునిసిపాలిటీలను మినహాయిస్తే, మిగతా ప్రాంతాల్లోంచి వచ్చిన దరఖాస్తులే 3,44,726 వరకు ఉన్నాయి. వీటిలో ఇప్పటి వరకు 60 వేల దరఖాస్తులను హెచ్ఎండీఏ అధికారులు జోన్ల వారీగా పరిశీలించారు. మిగతా వాటిని పరిశీలన చేయాలంటే తగినంత సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల క్రమబద్ధీకరణ విషయంలో అధికారుల్లో అయోమయం నెలకొంది. ప్రధానంగా ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల క్రమబద్ధీకరణ ప్రక్రియ చేపట్టాలంటే నిపుణులైన ప్లానింగ్ సిబ్బంది చాలా కీలకం. ప్రస్తుతం, హెచ్ఎండీఏతో సిబ్బంది అందుబాటులో లేదని, అలాంటి పరిస్థితుల్లో లక్షలాది దరఖాస్తుల పరిశీలన వేగంగా పూర్తి చేయడం అసాధ్యమనే అభిప్రాయాన్ని ప్లానింగ్ విభాగం అధికారులు వ్యక్తం చేస్తున్నారు.

గ్రేటర్‌లో జల్లులు

మరో 3 రోజులు వర్ష సూచన

సిటీబ్యూరో, జూన్ 11(నమస్తే తెలంగాణ): నైరుతి రుతు పవనాల ప్రభావంతో గ్రేటర్‌లోని పలు చోట్ల తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసాయి. మంగళవారం ఉదయం నుంచే నగరంలో వాతావరణం చల్లబడగా.., పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కూడా కురిశాయి. మధ్యాహ్నం నాలుగు గంటల ప్రాంతంలో మొదలైన జల్లులు తూర్పు హైదరాబాద్‌లో ఉన్న ఎల్బీ నగర్, ఉప్పల్, ఆదిభట్ల, శామీర్‌పేట్, మేడిపల్లి, మేడ్చల్, మల్కాజిగిరి వరకు క్రమంగా విస్తరిస్తూ సాయంత్రం ఏడు గంటల వరకు సాధారణ వర్షపాతంగా నమోదైంది. రాగల మరో మూడు రోజులు నగరంలోని పలు చోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వానలు కురిసే అవకాశమున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. కాగా, నగరంలో మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు గరిష్ట ఉష్ణోగ్రతలు 31.7 డిగ్రీలు, కనిష్ట ఉష్ణోగ్రతలు 24.4 డిగ్రీలు, గాలిలో తేమ 65 శాతంగా నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.

యశోద చైర్మన్ రవీందర్ రావుకు విద్యాదాత అవార్డు

సిటీబ్యూరో, జూన్ 11(నమస్తే తెలంగాణ): అనాథ పిల్లలకు అండగా నిలుస్తున్న యశోద ఫౌండేషన్, యశోద హాస్పిటల్స్ గ్రూప్ వ్యవస్థాపకులు గోరుకంటి రవీందర్ రావు సేవలను వందేమాతరం ఫౌండేషన్ గుర్తించి, రవీంద్రభారతీలో మంగళవారం జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో 'విద్యాదాత' అవార్డును ప్రదానం చేసింది. ఈ అవార్డు మరింత బాధ్యతను పెంచిందని రవీందర్ రావు తెలిపారు. సమాజానికి తనవంతు సాయం అందించడానికి ఎప్పుడు ముందుంటానని పేర్కొన్నారు.

గ్రేటర్ నాయీ సంఘం నూతన కార్యవర్గం

సిటీబ్యూరో, జూన్ 11(నమస్తే తెలంగాణ): తెలంగాణ నాయీబ్రాహ్మణ సంఘం గ్రేటర్ హైదరాబాద్ శాఖకు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో గ్రేటర్ అధ్యక్షులుగా చింతల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా గోల్కొండ అశోక్‌ని నియమించగా, వారికి రాష్ట్ర అధ్యక్షులు రాచమల్ల బాలకృష్ణ నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం నాయీ బ్రాహ్మణులను ఆదుకోవాలన్నారు. నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ.500 కోట్లు విడుదల చేయాలన్నారు. 50 ఏళ్లు దాటిన నాయీ బ్రాహ్మణులకు వృద్ధాప్య పింఛన్, వృత్తి ఆధారపడి, ఆకస్మికంగా మరణించిన ఆ కుటుంబాలకు రూ.5 లక్షల బీమా సౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో క్షవర వృత్తిదారుల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెన్నారం మల్లేషం, రాష్ట్ర వాయిద్య కళాకారుల సంఘం కన్వీనర్ మంగలి కృష్ణుడు, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు అన్నందాస్ చంద్రశేఖర్, రాష్ట్ర సహాయ కార్యదర్శి చందు, తదితరులు పాల్గొన్నారు

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి

పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయండి

బడంగ్‌పేట, జూన్ 11: తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలో పెండింగ్‌లో ఉన్న పనులను త్వరగా పూర్తి చేయించాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం ఎమ్మెల్యే చాంబర్‌లో మున్సిపాలిటీ అధికారులు, ప్రజా ప్రతినిధులతో ఎమ్మెల్యే సమీక్షా సమావేశం నిర్వహించారు. డివిజన్ల వారీగా ఉన్న సమస్యలను అధికారులను అడిగి ఎమ్మెల్యే తెలుసుకున్నారు. గత ప్రభుత్వంలో మంజూరైన అభివృద్ధి పనులపై ఆరా తీశారు. ప్రస్తుతం పనులు ఏ దశలో ఉన్నాయి..? అసంపూర్తిగా ఉన్న పనులను త్వరగా పూర్తి చేయాలని.. వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు రాకుండా జాగ్రతలు తీసుకోవాలని ఆదేశించారు. పారిశుధ్యం, డ్రైనేజీ, రోడ్లు, తాగునీటి సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని.. నిత్యం అధికారులు అందుబాటులో ఉండాలని.. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ వెంకట్ ట్రామ్, డీఈ యాదయ్య, ఏఈ భార్గవ రెడ్డి, కౌన్సిలర్ సుమన్, రవినాయక్, చప్పిడి లావణ్య రాజు తదితరులు ఉన్నారు.

నీట్ అక్రమాలపై ప్రధాని మోడీ దిష్టిబొమ్మ దహనం

ప్రధాని నరేంద్రమోడీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న విద్యార్థులు

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 11: నీట్ పరీక్షలో అక్రమాలు జరిగాయని ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో ప్రధాని నరేంద్ర మోడీ దిష్టిబొమ్మను మంగళవారం దహనం చేశారు. అనంతరం, రోడ్డుపై రాస్తారోకో చేపట్టారు. పోలీసులు రంగ ప్రవేశం చేసి, ఆందోళన చేస్తున్న విద్యార్థులను అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు మాట్లాడుతూ, నీట్ ప్రశ్నాపత్రం లీకైందని ఆరోపించారు. ఒకే పరీక్షా కేంద్రంలో ఆరుగురికి 720 మార్కులకు గాను 720 మార్కులు రావడమే దీనికి నిదర్శనమన్నారు. కేంద్ర ప్రభుత్వం, ఎన్టీఏలు విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నాయని మండిపడ్డారు. 180 ప్రశ్నలకు ఒక్కో ప్రశ్నకు నాలుగు మార్కుల చొప్పున మొత్తం 720 మార్కులకు పరీక్ష నిర్వహించగా, 719, 718 మార్కులు ఎలా వస్తాయి? అని ప్రశ్నించారు. పరీక్షా నిర్వహణలో జరిగిన అవకతవకలపై విచారణ జరిపి నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు. విద్యార్థులు ఎంతో కష్టపడి పెద్ద పెద్ద నగరాల్లో లక్షలు ఖర్చు చేసి కోచింగ్‌కు తీసుకున్నప్పటికీ, ఎన్టీఏ అవినీతితో అదంతా వృథా అవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పరీక్షను తిరిగి నిర్వహించి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

తెలుగు రాష్ట్రాల్లో హ్యూందాయ్ విస్తరణ

డిజిటల్ ఫ్లోట్ వ్యాన్లలో విస్తృత ప్రచారం

సిటీబ్యూరో, జూన్ 11(నమస్తే తెలంగాణ): ప్రముఖ ఆటో మొబైల్ సంస్థ హ్యూందాయ్ రెండు తెలుగు రాష్ట్రాల్లో విస్తరించేందుకు ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేసింది. గ్రామీణ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున వినియోగదారులకు దగ్గరయ్యేందుకు డిజిటల్ ఫ్లోట్ పేరుతో ప్రత్యేకంగా ఒక కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. హ్యూందాయ్ కంపెనీ ఉత్పత్తి చేస్తున్న హ్యాచ్‌బాక్ కార్లు గ్రాండ్ ఐ10 నియోస్, ఎస్‌యూఈ ఎక్స్‌టర్, వెన్యూ మోడల్స్‌ను గ్రామీణ ప్రాంతాల్లోకి తీసుకువెళ్లేందుకు ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నారని హ్యూందాయ్ మోటార్ ఇండియా లిమిటెడ్ రీజినల్ సేల్స్ హెడ్ జి.రామ్ కుమార్ మంగళవారం తెలిపారు. కార్లను కొనుగోలు చేసే వినియోగదారులకు నేరుగా వారి ఇంటి వద్దే డెలివరీ చేసేలా డిజిటల్ ఫ్లోట్ కార్యాచరణ ఉంటుంది. ఇందులో భాగంగా కంపెనీ ప్రతినిధులు డిజిటల్ ఫ్లోట్ వ్యాన్‌కు పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. ఈ వ్యాన్ తెలుగు రాష్ట్రాల్లోని గ్రామీణ ప్రాంతాల్లో తిరిగి తమ కార్లను విక్రయాలను పెంచేలా ప్రచారం చేస్తాయని, సుమారు 75 ప్రాంతాలలో కొత్తగా ప్రారంభించిన డిజిటల్ ఫ్లోట్ వ్యాన్ల ద్వారా కవర్ చేస్తామని తెలిపారు.

ఆయుష్‌ను సందర్శించిన ఒరిస్సా విద్యార్థులు

సైదాబాద్, జూన్ 11: గడ్డి అన్నారం లోని ఆయుర్వేద పరంపర సంస్థను ఒరిస్సా రూర్కెలాలోని ఉత్కల్మణి హోమియోపతిక్ మెడికల్ కాలేజ్ విద్యార్థులు, హాస్పిటల్ 4వ సంవత్సర బీహెచ్ఎంఎస్ వైద్య విద్యార్థులు మంగళవారం సందర్శించారు. డాక్టర్ అశ్వనీ కుమార్ సాహూ, డాక్టర్ సుభాన్సు ప్రభా మిశ్రా పర్యవేక్షణలో వారు ఆయుష్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయుష్ సంస్థ ఇన్‌చార్జి అసిస్టెంట్ డైరెక్టర్ జీపీ ప్రసాద్ ఆయుష్ సంస్థల పనితీరును, చేపట్టే కార్యక్రమాలను, గ్రంథాలయంలోని పురాతన, సంగ్రహాలయంలోని తాళ పత్ర గ్రంథాలు, వైద్య చికిత్స చరిత్ర సంబంధించిన విషయాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఆయుష్ పరిశోధన అధికారి డాక్టర్ బిస్వోరంజన్ దాస్, డాక్టర్ అష్పాక్ అహ్మద్, డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ సాకేత్‌రామ్, డాక్టర్ సంతోష్ మనే, లైబ్రేరియన్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ముగిసిన ఎంటర్‌ప్రెన్యూయర్‌షిప్ శిక్షణ

శిక్షణలో పాల్గొన్న అధ్యాపకులు

మేడ్చల్, జూన్ 11: గుండ్ల పోచంపల్లి మున్సిపాలిటీ కండ్లకోయలోని సీఎంఆర్ సెట్‌లో అధ్యాపకులకు రెండు రోజులుగా నిర్వహిస్తున్న ఇన్నోవేషన్, ఎంటర్‌ప్రెన్యూయర్‌షిప్ శిక్షణ మంగళవారం ముగిసింది. ఇనిస్టిట్యూట్ ఇన్నోవేషన్ కౌన్సిల్(ఐటీసీ) స్టార్టప్ మెంటర్లు అభినవ్, సుమంత్ అధ్యాపకులకు శిక్షణను ఇచ్చారు. ముగింపు కార్యక్రమంలో గోపాల్ రెడ్డి మాట్లాడుతూ, సృజనాత్మక ఆలోచనలతో నూతన ఆవిష్కరణలకు నాంది పలకాలన్నారు. నూతన ఆలోచనలతో ముందుకు వస్తే కార్యరూపంలోకి తీసుకువచ్చేందుకు అవసరమైన అన్ని రకాల అవకాశాలు మార్కెట్‌లో సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. అధ్యాపకులు శిక్షణను వినియోగించుకొని, భవిష్యత్‌లో విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలని సూచించారు. కార్యక్రమంలో సీఎంఆర్ సీఈవో అభినవ్ రెడ్డి, ప్రిన్సిపాల్ మేజర్ వీఏ నారాయణ, కార్యక్రమ కన్వీనర్లు ప్రేమలత, అబ్దుల్ సుభానీ, డీన్‌లు, హెచ్‌వోడీలు, వివిధ కళాశాలల అధ్యాపకులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమమే ప్రధాన ధ్యేయం

238 మంది అసైన్‌మెంట్ కార్మికులకు రెగ్యులర్ ఆర్డర్లు, 181 మందికి పదోన్నతి

మదర్ డెయిరీ సంస్థ చైర్మన్ లింగాల శ్రీకర్‌రెడ్డి

మదర్ డెయిరీ సంస్థ కార్యాలయంలో కార్మికులకు రెగ్యులర్ ఆర్డర్ కాపీని అందజేస్తున్న చైర్మన్ లింగాల శ్రీకర్‌రెడ్డి, పాలకవర్గ సభ్యులు

హయత్‌నగర్, జూన్ 11: నల్లగొండ, రంగారెడ్డి పాల ఉత్పత్తిదారుల సహాయక సహకార యూనియన్ మదర్ డెయిరీ సంస్థలో పనిచేస్తున్న కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తున్నామని సంస్థ చైర్మన్ లింగాల శ్రీకర్‌రెడ్డి తెలిపారు. హయత్‌నగర్‌లోని మదర్ డెయిరీ కార్యాలయంలో పాల శ్రీతలీకరణ కేంద్రంలో పనిచేస్తున్న 238 మంది అసైన్‌మెంట్ కార్మికులకు రెగ్యులర్ ఆర్డర్లు, 181 మంది రెగ్యులర్ ఎంప్లాయీస్‌కు ప్రమోషన్స్ ఆర్డర్ కాపీలను సంస్థ చైర్మన్ లింగాల శ్రీకర్‌రెడ్డి, పాలకవర్గ సభ్యులతో కలిసి మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సంస్థ ఆర్థిక పరిస్థితి కొంత మేరకు ఇబ్బందికరంగానే ఉన్నప్పటికీ 15 నుంచి 20 ఏండ్లుగా పనిచేస్తున్న కార్మికులకు న్యాయం చేయాలనే ఉద్దేశంతో పాలకవర్గ బోర్డు ఈ మేరకు నిర్ణయం తీసుకుందన్నారు. పదోన్నతులు, రెగ్యులర్ చేసే విషయంలో పూర్తి పారదర్శకతతో వ్యవహరిస్తున్నామన్నారు. కొంతమంది కార్మికుల వద్ద అక్రమ వసూళ్లు చేసి లబ్ధి చేకూర్చుకున్నట్లుగా వస్తున్న ఆరోపణలు అవాస్తవమని స్పష్టం చేశారు. యూనియన్‌లో ఎటువంటి నిర్ణయాన్నైనా బోర్డు ఆమోదంతోనే తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు చింతలపూడి వెంకట్ రామిరెడ్డి, ఫిరంగి వెంకట రామిరెడ్డి, రచ్చ లక్ష్మి నర్సింహారెడ్డి, మందడి ప్రభాకర్ రెడ్డి, కస్తూరి పాండు, జాల రాంరెడ్డి, కందాల అలివేలు రంగారెడ్డి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గాంధీకి అమెరికా వైద్యుడి వితరణ

రూ.50 లక్షల విలువైన వైద్య పరికరాల విరాళం

బన్సీలాల్‌పేట్, జూన్ 11: గాంధీ మెడికల్ కాలేజీ పూర్వ విద్యార్థి, తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం, అమెరికా శాఖ అధ్యక్షుడు, సీనియర్ గ్యాస్ట్రో ఎంటరాలజీ వైద్యుడు డాక్టర్ దివేశ్ అనిరెడ్డి, సికింద్రాబాద్‌లోని గాంధీ దవాఖాన గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగానికి రూ.50 లక్షల విలువైన వైద్య పరికరాలను విరాళంగా అందజేశారు. గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగం హెచ్ఓడీ, ప్రొఫెసర్ పి.శ్రావణ్ కుమార్ మంగళవారం ఆయనకు సన్మానం చేసి, ధన్యవాదములు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ, గాంధీ వైద్య కళాశాలలో 1978లో ఎంబీబీఎస్ పూర్తి చేసిన దివేశ్ అనిరెడ్డి, తాను చదివిన కాలేజి, దవాఖానకు విలువైన వైద్య సామగ్రిని అందజేసి ఎందరో పూర్వ విద్యార్థులకు ఆదర్శంగా నిలిచారు. గతంలో కూడా పలుమార్లు స్వదేశానికి వచ్చే సమయంలో ఆయన తనకు ఫోన్ చేసి గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగానికి అవసరమైన సామగ్రి గురించి అడుగుతారని, అమెరికాలో కొనుగోలు చేసి విమానంలో ఎంతో బరువైన,

గాంధీ దవాఖాన గ్యాస్ట్రో ఎంటరాలజీ హెచ్ఓడీ శ్రావణ్‌కుమార్‌కు వైద్య సామగ్రిని అందజేసిన అమెరికా వైద్యుడు దివేశ్ అనిరెడ్డి

విలువైన సామగ్రిని ఎయిర్‌పోర్టులో కస్టమ్స్ సుంకం చెల్లించి, గాంధీ దవాఖానకు వచ్చి ఇవ్వడం ఎంతో అభినందనీయమన్నారు. నేటి తరం వైద్యులు ఆయనను ఆదర్శంగా తీసుకుని, తాము కూడా సంపాదించిన దానిలో కొంత సమాజానికి తిరిగి ఇవ్వాలని సూచించారు. అనంతరం, దాత దివేశ్ అనిరెడ్డి మాట్లాడుతూ, తాను 1987లో అమెరికా వెళ్లాక సేవాభావం కలిగిన మిత్రులతో కలిసి 20 ఏండ్ల క్రితం తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం ఏర్పాటు చేశామన్నారు. విద్యా, వైద్యం, వ్యవసాయం, నైపుణ్య శిక్షణ రంగాలలో తాము తెలంగాణలో అనేక సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని అన్నారు. తాను చదువుకున్న గాంధీ వైద్య కళాశాల తనకు మాతృ సంస్థ లాంటిదని, వేలాది మంది నిరుపేదలకు కార్పొరేట్ స్థాయిలో వైద్యసేవలు అందిస్తున్న గాంధీ దవాఖానాకు తమ వంతు సహాయం అందించడం ద్వారా ఎంతో సంతృప్తి లభిస్తుందని అన్నారు. గ్రామీణ ప్రాంతాలలో మెరుగుపరచాల్సిన విద్యా వ్యవస్థపై తమ సంస్థ చేసిన పరిశోధన వివరాలతో కూడిన నివేదికను గత ప్రభుత్వానికి అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగం వైద్యులు, నర్సులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్య పరిరక్షణే మిధాని ధ్యేయం

సీఎండీ సంజయ్ కుమార్ ఝా

ఉస్మానియాకు అత్యుత్తమ అంబులెన్స్ అందజేసిన మిధాని

అంబులెన్స్‌ను జెండా ఊపి ఉస్మానియా దవాఖానకు అందజేస్తున్న మిధాని చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సంజయ్ కుమార్ ఝా, తదితరులు.

సైదాబాద్, జూన్ 11: సమాజంలో అణగారిన వర్గాల ఆరోగ్య పరిరక్షణ కోసం కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్)లో భాగంగా మిశ్ర ధాతు నిగమ్ లిమిటెడ్ (మిధాని) సంస్థ ఉస్మానియా దవాఖానకు రూ. 31 లక్షల అడ్వాన్సుడ్ కార్డియాక్ లైఫ్ సపోర్ట్ అంబులెన్స్‌ను అందజేసింది. మినీ రత్న, షెడ్యూల్డ్ 'బీ' డిఫెన్స్ పబ్లిక్ సెక్టార్ యూనిట్ డిపార్టుమెంట్ ఆఫ్ డిఫెన్స్ ప్రొడక్షన్, మినిస్ట్రీ ఆఫ్ డిఫెన్స్ సీఎస్ఆర్ కింద మిధాని కార్పొరేట్ ఆఫీస్ వద్ద మంగళవారం జరిగిన కార్యక్రమంలో మిధాని చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సంజయ్ కుమార్ ఝా జెండాను ఊపి అంబులెన్స్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిధాని సంస్థ పేదల ఆరోగ్య పరిరక్షణ, పరిశుభ్రత, విద్య, నైపుణ్య రంగాల్లోని అనేక అంశాలల్లో పలు సేవా కార్యక్రమాలను చేపడుతున్నట్లు వివరించారు. ఉస్మానియా దవాఖానకు ఆత్యాధునిక అంబులెన్స్ అందజేయటం ద్వారా వేలాది మంది రోగులకు అత్యుత్తమ వైద్య సేవలు అందించడానికి, వారి అవసరాలను తీర్చడానికి ఎంతోగాను ఉపయోగపడుతుందని ఉస్మానియా దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ బి.నాగేంద్ర అన్నారు. కార్యక్రమంలో మిధాని ఫైనాన్స్ డైరెక్టర్ ఎన్.గౌరీ శంకర్ రావు, ప్రొడెక్షన్, మార్కెటింగ్ డైరెక్టర్ టి.ముత్తు కుమార్, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ డాక్టర్ ఉపేంద్ర వెన్నం, జనరల్ మేనేజర్ రామకృష్ణారావు, ఏఆర్ రష్మి, సునీల్ కుమార్, రాఘవేంద్ర, ఉస్మానియా దవాఖాన సీనియర్ వైద్యులు పాల్గొన్నారు.